# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- తుఫాన్‌తో ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా చూడాలి
- శిథిలావస్థలో ఉన్న భవనాలను ఖాళీ చేయించాలి
- ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలి
- మత్స్యకారులు చేపట వేటకు వెళ్లొద్దు
- కలెక్టర్ కే శశాంక

మహబూబాబాద్, డిసెంబర్6: మిగ్‌జాం తుఫాన్ ప్రభావంతో రెండు రోజులగా కురుస్తున్న వర్షాలకు ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా తక్షణం స్పందించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కే శశాంక సూచించారు. జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలపై బుధవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అన్ని మండలాల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు, వైద్యశాలలు, పాఠశాలలు ఉంటే ఖాళీ చేయించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. విద్యుత్ అధికారులు ప్రమాదాలు జరుగకుండా సిబ్బందిని స్థానికంగా విధులు నిర్వర్తించేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. వేగంగా వీస్తున్న గాలుల కారణంగా ప్రజలు తప్పనిసరి అయితేనే బయటకు రావాలని సూచించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దన్నారు. పశువులను మేతకు విడిచి పెట్టకుండా రైతులు ఇంటి వద్దే ఉంచుకొని సంరక్షించాలని తెలిపారు. రైతులు, కూలీలు పొలాల్లోకి వెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే విద్యా సంస్థలకు సెలవులు ఇచ్చామన్నారు. చెరువుల వద్ద భద్రతకు ఇసుక నింపిన బస్తాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అదనంగా టార్పాలిన్లు ఉంచుకుని అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. మున్సిపాలిటీలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో పారిశుధ్యంపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో 24 గంటల కంట్రోల్ రూమ్ పనిచేస్తుందన్నారు. అత్యవసరాల కోసం కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన సెల్ నంబర్ 7995074803కు సమాచారం అందించి సాయం పొందాలని సూచించారు.

## జిల్లాలో 49.6 మి.మీ వర్షపాతం

మహబూబాబాద్, డిసెంబర్6: మహబూబాబాద్ జిల్లాలో 49.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. కొత్తగూడలో 53.4 మి.మీ, గంగారంలో 59.8, బయ్యారంలో 39, గార్లలో 38.2, గూడూరులో 51.8, డోర్నకల్‌లో 62, కురవి లో 39.4, మహబూబాబాద్‌లో 58.8, కేసముద్రంలో 65.6, నెల్లికుదురులో 48.8, నర్సింహులపేటలో 50, చిన్నగూడూరులో 62.2, మరిపెడలో 66.4, దంతాలపల్లిలో 42, తొర్రూరులో 32.6, పెద్దవంగరలో 23.2 మి.మీ వర్షపాతం నమోదైంది.



చిన్నగూడూరులో వర్షపు నీటిలో తడిసి ముద్దయిన వరి మెదలు



వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అంబరీష

# ఐదేళ్లలోపు పిల్లలందరికీ టీకాలు వేయించాలి

- 30 ఏళ్లు పైబడిన వారందరికీ రక్త పరీక్షలు నిర్వహించాలి
- జిల్లా వైద్యాధికారి డాక్టర్ అంబరీష

మహబూబాబాద్, డిసెంబర్6: ఐదేళ్లలోపు పిల్లందరికీ 100 శాతం టీకాలు వేయించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ అంబరీష సూచించారు. బుధవారం జిల్లాలోని బయ్యారం, గంధంపల్లిలోని వ్యాధి నిరోధక కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులను 12 వారాల లోపు పీహెచ్‌సీల్లో నమోదు చేయాలని చెప్పారు. రక్తహీనత ఉన్న గుర్తించి వారికి ఐరన్ టాబ్లెట్లు ఇచ్చేలా వైద్యులు చొరవ చూపాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని వ్యాధుల బారిన పడకుండా ఉండాలని ప్రజలకు సూచించారు. 30 ఏళ్లు పైబడిన వారందరికీ రక్త పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. అసంక్రమిత వ్యాధులైన షుగర్, బీపీ, క్యాన్సర్ వంటి వాటిని గుర్తించి చికిత్స అందించాలన్నారు. కుష్టు, రాగి వర్ణం, స్పర్శలేని మచ్చలు ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులను సంప్రదించాలని కోరా రు. ముందుగా గుర్తించి వైద్యం అందిస్తే వ్యాధులు త్వరితగతిన నయం చేసుకోవచ్చని సూచించారు. అంగవైకల్యం రాకుండా కాపాడుకోగలుతామని, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు ప్రజల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ విజయ్‌కుమార్, సాగర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కృష్ణార్జునరావు, హెల్త్ ఎడ్యుకేటర్ కేవీ రాజు, సబ్ యూనిట్ అధికారి వడ్డెబోయిన శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# హెచ్చరిక బోర్డులు పెట్టాలి

- ఏ క్షణమైనా పాకాల ఏటి వద్ద వరద ప్రవాహం పెరిగే అవకాశం
- రాకపోకలు పూర్తిగా నిలిపివేయాలి
- వాగు వద్ద వరద ఉధృతిని పరిశీలించిన ఎస్పీ సంగ్రామ్‌సింగ్

గార్ల, డిసెంబర్6: తుఫాన్‌తో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రాంపురం పాకాల ఏటి వద్ద బ్రిడ్జి మీద నుంచి వరద వెళ్తోందని, హెచ్చరిక బోర్డులు పెట్టాలని ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీ పాటిల్ పోలీసు అధికారులకు సూచించారు. బుధవారం వరద ఉధృతిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గార్ల, రాంపురం, మద్దివంచ, కొత్త తండాతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, వాహనాలు రాకపోకలు పూర్తిగా నిలిపివేయాలన్నారు. ఏ క్షణంలోనైనా వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉందని, ప్రజలు రాకపోకలు నిలిపి వేసేందుకు బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర సమయంలో హెల్ప్‌లైన్ నంబర్లను సమాచారం ఇవ్వాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట డీఎస్పీ సత్యనారాయణ, గార్ల, బయ్యారం సీఐ బాబురావు, ఎస్సై బానోత్ వెంకన్న ఉన్నారు.



పాకాల ఏటిపై వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సంగ్రామ్ సింగ్

## అంబేద్కర్ కృషి భావి తరాలకు స్ఫూర్తి : నిట్ డైరెక్టర్



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 6 : దేశ నిర్మాణానికి అంబేద్కర్ చేసిన కృషి భావి తరాలకు స్ఫూర్తి అని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి అన్నారు. నిట్‌లోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి నిట్ డైరెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ భారత ప్రజాస్వామ్యానికి పునాది వేసిన దార్శనికుడు అని అన్నారు.



పాగాల సంతాప సభకు హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా, చిత్రంలో ఎమ్మెల్యే కడియం

# పాగాల.. ప్రజానేత

- జడ్పీ చైర్మన్‌గా, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా సంపత్‌రెడ్డి సేవలు
- కేసీఆర్ మనసులో ఉన్న వ్యక్తి
- ప్రజా సేవలో మమేకమైన నాయకుడు
- ఆయన కుటుంబానికి అండగా ఉంటాం
- జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి
- బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో సంతాప సభలో పాగాలకు ఘన నివాళి
- హాజరైన మాజీ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి, తాటికొండ, ప్రజాప్రతినిధులు, నాయకులు

జనగామ, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : 'ఉద్యమ వీరుడా..అలుపెరుగని యోధుడా.. జోహార్ సంపతన్న.. జోహార్ జోహార్.. నీకేవే మా కన్నీటి వీడ్కోలు' అంటూ జనగామ జడ్పీచైర్మన్ పాగాల సంపత్‌రెడ్డికి గులాబీశ్రేణులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధాంజలి ఘటించారు. గుండెపోటుతో హఠాన్మరణం పొందిన పాగాల సంతాప సభ బుధవారం బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించగా, వేలాది మంది కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు. జడ్పీచైర్మన్‌గా, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా సంపత్‌రెడ్డి సేవలను కొనియాడుతూ కన్నీటి నివాళులర్పించారు. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, డాక్టర్ తాటికొండ రాజయ్య, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో బీఆర్ఎస్ పార్టీ బ్రహ్మాండంగా ఉంది.. మనందరం పార్టీకి అండగా ఉ న్నాం.. స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ నుంచి అద్భుతమైన ఫలితాలు ఇచ్చి విజయం సాధించాం.. ప్రభుత్వం ఓటమి పాలయిందని అత్యంత ఎక్కు వ బాధపడ్డది సంపత్‌రెడ్డి అని అన్నారు. కేసీఆర్ మనసులో ఉన్న వ్యక్తి.. చిరస్మరణీయడు సంపత్‌రెడ్డి అని బాధాతప్త హృదయంతో నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో అందరూ పాల్గొన్నారు. ఎవరూ సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ పదవుల కోసం ఆశపడి ఉద్యమంలోకి ఎవరూ రాలేదు.. ఆ మాదిరిగానే తెలంగాణ రావాలి.. రాష్ట్రం బాగుపడాలనే ఉద్దేశంతోనే సంపత్‌రెడ్డి ఉద్యమంలోకి వచ్చారు.. పార్టీ కోసమే నిరంతరం కష్టపడే వ్యక్తి.. ఉద్యమంలో ఏనాడూ సంపాదించలేదన్నారు. 'గ్రామీణ ప్రాంతాల్లో నికార్సుగా ఉన్న నాయకుల్లో సంపత్‌రెడ్డి మొదటి స్థానంలో ఉన్నాడు.. ఆయనకు ఉన్న బలగం ఎవరికీ లేదు.. ఇది కేవలం ఆయనకే సాధ్యమైంది..' అని నివాళులర్పించారు. మా ఉద్యమకారుడు సంపత్‌రెడ్డికి మంచి స్థానంలో పదవి కట్ట బెట్టాలని ప్రతిసారి కేసీఆర్ గుర్తు చేసేవారని, ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ ఇవ్వాలని అందుకే ఆయనకు జడ్పీ చైర్మ న్, పార్టీ జిల్లా అధ్యక్షుడిగా జోడు పదవులు అప్పగించారని గుర్తుచేశారు. ఉద్యమకారుడు మాట ఆలా ఉంటుందని, 2001లో మొదటి నుంచి ఉద్యమంలో పని చేశాడు కాబట్టే పదవులు అప్పగించారని, సంపత్ మీద కేసీఆర్‌కు ఎనలేని ప్రేమ ఉంటుందన్నారు. సంపత్ కుటుంబానికి తాను వ్యక్తిగతంగా ఆండగా ఉంటా.. అయనకు ఉన్న అప్పు తీర్చే బాధ్యత మేమే తీసుకుంటాం.. ఆర్థికంగా మేమందరం చూసుకుంటాం.. ఆ కుటుంబానికి ఎలాంటి ఇబ్బంది కలుగనివ్వం.. సంపత్ నాకు తమ్ముడు కంటే ఎక్కువ అని అన్నారు. ప్రభుత్వం లేదని నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని, ఏ గ్రామంలో చూసినా గులాబీ నాయకులు ఎక్కువగా ఉన్నారని, ఎవరూ మనుసును గాయం చేసుకోవద్దు.. మిమ్మల్ని అక్కున చేర్చుకొంటా అని పల్లా శ్రేణులకు మనోధైర్యాన్ని కల్పించారు. ఐదేళ్లు నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి బాధ వచ్చినా జిల్లా నుంచి గెలిచిన కడియం శ్రీహరి, నేను పంచుకుంటాం అని భరోసా ఇచ్చారు. గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇష్టం వచ్చినట్లు ఇండ్లల్లో దాడులు చేస్తున్నారని, అనవసరంగా దూషిస్తే ఊరుకోం..గెలిచినా ఓడి నా గ్రామాల్లో ఎక్కువగా బలగం మనదే ఉన్నదని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో మనం మళ్లీ గెలుస్తాం..అందరం ఓపిక పడుదాం.. గులాబీ జెండాకు అండగా ఉందాం.. సంపత్‌కు వేలాది మంది తరలివచ్చి ఘనమైన నివాళులర్పించారు. ప్రజా నాయకుడంటే ఇలాగే ఉండాలని అని పల్లా రాజేశ్వర్‌రెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, బీఆర్ఎస్ నాయకలు మండల శ్రీరాములు, ఇర్రి రమణారెడ్డి, ఎడవెల్లి కృష్ణారెడ్డి, మద్దూరు ఎంపీపీ బద్దిపడుగ కృష్ణారెడ్డి, లింగాలఘనపురం జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి సహా పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నివాళులర్పించారు.